ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
బుధవారం 26 నవంబరు 2025

పంచమి వేళ.. పద్మజన సరోవరం



● జనసంద్రమైన తిరుచానూరు ● పటిష్ఠ భద్రతా చర్యలతో ప్రశాంతంగా పంచమితీర్థం ● ధ్వజావరోహణంతో ముగిసిన పద్మావతీదేవి బ్రహ్మోత్సవాలు

కార్తిక మాసం శుక్లపక్ష పంచమి తిథి.. తిరుచానూరులోని పద్మసరోవరంలో అమ్మవారు ఆవిర్భవించిన రోజు. ఏటా పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో ఇదే తిథిన నిర్వహించే పంచమితీర్థంలో పుష్కరిణి స్నానమాచరిస్తే కోటిజన్మల పుణ్యఫలం చేకూరుతుందన్నది భక్తుల నమ్మకం. అందుకే మంగళవారం జరిగిన పంచమితీర్థానికి భక్తులు పోటెత్తారు. తమిళనాడు నుంచీ అధిక సంఖ్యలో భక్తులు రావడంతో తిరుచానూరు జనసంద్రమైంది. లక్ష మందికిపైగా పుష్కరిణి స్నానం చేసినట్లు అంచనా. ఇంత రద్దీకి తగ్గట్టు పటిష్ఠ ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టడంతో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. 8 గంటలకు సన్నిధి ముఖమండపంలో అమ్మవారికి చూర్ణాభిషేకం, ఆస్థానం జరిపారు. 9 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని, చక్రత్తాళ్వారును వేంచేపుగా పద్మసరోవరం పంచమితీర్థం మండపానికి వేంచేపు చేశారు. 10.56గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఆ మండపానికి చేరుకుంది. ఆ సారెతో అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు జియ్యంగార్ల సమక్షంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుట్టిన రోజు కానుకగా అమ్మవారికి శ్రీవారు పంపిన ఆభరణాలతో, దివ్య సుగంధ తులసిమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్-కుంభలగ్నంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు. అప్పటికే పుష్కరిణిలో వేచిఉన్న భక్తులు 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవింద' అంటూ స్నానాలాచరించారు. రాత్రి వరకు లక్ష మందికిపైగా పుష్కరిణి స్నానాలు చేసినట్లు టీటీడీ అంచనా. పుష్కరిణిలో స్నానాల కోసం సోమవారం అర్ధరాత్రికే హోల్డింగ్ పాయింట్లు భక్తులతో నిండిపోయాయి. వారికి మంగళవారం ఉదయం అల్పాహారం, పాలు అందించారు. 10గంటల నుంచి ప్రత్యేక క్యూలైన్ల ద్వారా పుష్కరిణిలోకి అనుమతించారు. మూలమూర్తి దర్శనానికీ భక్తులు పోటెత్తారు. మంగళవారమంతా బంగారు చీరలో స్వర్ణశోభితంగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 10 గంటలకు ధ్వజావరోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

\- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

కమ్మగుట్టపల్లె అడవిలో పులి సంచారం

పూతలపట్టు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లె సమీపానగల అడవిలో పులి సంచరిస్తోందన్న సమాచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కమ్మగుట్టపల్లె గ్రామ సమీపాన కమ్మగుట్ట అటవీ ప్రాంతం ఉంది. మంగళవారం చేపలు పట్టేందుకు వెళ్లిన కొంతమంది అడవిలో సంచరిస్తున్న పులిని చూసి పరుగులు తీశారు. ఈ విషయం పరిసర ప్రాంతాల ప్రజలకు తెలియడంతో భయాందోళనకు గురవుతున్నారు.

కాణిపాక ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం నేడు

ఐరాల(కాణిపాకం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఆలయ ఉభయదారులు,స్థానికులు, స్వామి భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని ఈవో కోరారు.

40 వేల రైతు కుటుంబాలకు సీఎం చంద్రబాబు లేఖలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన మంగళవారం జిల్లావ్యాప్తంగా 40,548 మంది రైతు కుటుంబాలకు సీఎం లేఖలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 313 రైతు సేవా కేంద్రాల పరిధిలో మొదలైన రైతన్నా మీ కోసం కార్యక్రమాల్లో చిత్తూరు మండలం పాలూరు క్లస్టర్‌లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన రెడ్డి, మార్కెటింగ్ కార్యదర్శి ఇందుమతి పాల్గొన్నారు.పాలసముద్రం మండలం రామలింగాపురం,రేణుకాపురం, జీడీ నెల్లూరులోని వేపంజేరిలో పశుసంవర్థక శాఖాధికారి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.వెదురుకుప్పం మండలంలోని చెంచుగూడి, తిరుమలయ్యగారిపల్లి, ఎస్‌ఆర్‌పురం మండలంలోని పిల్లారికుప్పంలో జిల్లా పటుపరిశ్రమాధికారి సుజాతమ్మ పాల్గొన్నారు. బంగారుపాళ్యంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ రవికుమార్ పాల్గొన్నారు.



పెద్దపంజాణి మండలంలోని శివాడి గ్రామంలో పంపిణీ చేసిన సీఎం లేఖలను ప్రదర్శిస్తున్నరైతులతో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

మూడు ముక్కలుగా పుంగనూరు

పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు మూడు ముక్కలయ్యాయి. రెండేసి మండలాలను ఒక్కో రెవెన్యూ డివిజన్‌లోకి చేరుస్తూ క్యాబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదనను సీఎం చంద్రబాబు ఆమోదించారు. దీంతో పాటు ఎన్నికల హామీ మేరకు మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు కూడా మంగళవారం సీఎం నుంచి ఆమోదం లభించింది.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

రెండేసి మండలాల చొప్పున మూడు డివిజన్లలోకి చేర్పు

మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ఆమోదం

ఫైనల్‌గా చిత్తూరులో 28 మండలాలు



పుంగనూరు నియోజకవర్గంలో ఆరు మండలాలుండగా, నాలుగు పలమనేరు డివిజన్‌లో, రెండు చిత్తూరు డివిజనులో ఉన్నాయి. తాజా నిర్ణయం మేరకు చౌడేపల్లె, పుంగనూరు మండలాల్ని మదనపల్లె డివిజనులోకి.. సదుం, సోమల మండలాలను కొత్తగా ఏర్పాటయ్యే పీలేరు డివిజనులోకి మార్చనున్నారు. ప్రస్తుతం చిత్తూరు డివిజనులో ఉన్న రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్ని యథాతథంగా చిత్తూరులోనే కొనసాగించనున్నారు. ఈ లెక్కన పుంగనూరు నియోజకవర్గం ఏకంగా మూడు రెవెన్యూ డివిజన్లలో, రెండు జిల్లాల్లో ఉంటుంది.

చిత్తూరు జిల్లాను 2022 ఏప్రిల్‌లో వైసీపీ ప్రభుత్వం పునర్విభజన చేసింది. అన్ని అర్హతలున్న మదనపల్లెను కాదని, రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతో అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో చంద్రబాబు పలుమార్లు మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తానని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అందులో భాగంగానే కొన్ని నెలల కిందట పుంగనూరును మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోకి మార్చేందుకు ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లా పునర్విభజన కోసం క్యాబినెట్ సబ్ కమిటీని కూడా నియమించారు. ఈ కమిటీ ప్రతినిధులు అనేకమార్లు సీఎంతో చర్చలు జరపగా, మంగళవారం మదనపల్లె కొత్త జిల్లా ఏర్పాటుకు ఆమోదం లభించింది.

● **నగరిలోని మూడు మండలాలు చిత్తూరులోనే**

పుంగనూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మదనపల్లె జిల్లాలోకి వెళ్తున్న క్రమంలో.. నగరి నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలోనే కొనసాగించనున్నారు. వాస్తవానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అనేకమార్లు ఈ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపేస్తామని హామీ ఇచ్చారు. పుంగనూరులో జరిగిన మార్పుల నేపథ్యంలో నగరి కూడా వెళ్లిపోతే, చిత్తూరు జిల్లా బాగా చిన్నదిగా మారుతుందని నగరి విషయమై పునరాలోచిస్తున్నట్లు తెలిసింది. ఫైనల్‌గా చిత్తూరు జిల్లా 32 నుంచి 28 మండలాలకు తగ్గింది.

● **మదనపల్లె జిల్లా స్వరూపం**

నూతనంగా ఏర్పాటయ్యే మదనపల్లె జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, రెండు రెవెన్యూ డివిజన్లు ఉంటాయి. మదనపల్లె డివిజన్ ఇప్పటికే ఉండగా, నూతనంగా పీలేరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. మదనపల్లె డివిజన్‌లోకి మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు... పీలేరు రెవెన్యూ డివిజన్‌లోకి సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కేవీపల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు చేరనున్నాయి. మొత్తం 11.05 లక్షల జనాభాతో ఈ జిల్లా ఏర్పాటు కానుంది.

రాజ్యాంగ పుస్తక ఆకృతిలో విద్యార్థులు

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వేడుకలకు ముందస్తుగా మంగళవారం రాజ్యాంగ దినోత్సవం పుస్తకం ఆకారంలో విద్యార్థులు కూర్చొన్నారు. రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



తాటిగేగులు వచ్చేశాయ్!



పండగ నెలలో సందడిచేసే గేగులు అప్పుడే కనిపిస్తున్నాయి. బజార్లలో బుట్టల్లో పెట్టుకుని అమ్ముతున్నారు. తాటిముట్టె మొలకెత్తడానికి ముందు దశే ఇది. తేగలనీ, గేగులనీ పిలుస్తారు. దీన్ని రెండు పాయలుగా చీలిస్తే మధ్యలో ఉండే దబ్బలాంటి తెల్లటిదాన్ని చందమామ అంటారు. దీని కొన మెత్తగా రుచిగా ఉంటుంది. గేగు తొక్క తీసేసి తింటే మొత్తం పిండిపదార్థమే. పీచు ఎక్కువగా ఉండే ఆహారం కావడం వల్ల జీర్ణక్రియకు బాగా దోహదపడుతుంది. తాటి చెట్ల నుంచి రాలిన పండ్లు చీకిపోయి ముట్టెలు తేలుతాయి. వీటిని ఏరి మెత్తని మట్టిలో కప్పిపెడితే మూడు నెలలకు తేగలు తయారవుతాయి. వీటిని తవ్వితీసి కాల్చుకునిగానీ ఉడకబెట్టుకుని గానీ తింటారు. సహజసిద్ధమైన ప్రకృతి ఆహారం ఇది. ఇప్పటికీ ప్రభుత్వ బడుల ముందు ఈ సీజన్‌లో అమ్ముతూ ఉంటారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

10న స్థానికులకు వైకుంఠద్వార దర్శనాల టోకెన్ల విడుదల

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే చివరి మూడురోజులు స్థానికులకు దర్శన అవకాశం కల్పించనున్నారు. జనవరి 6, 7, 8 తేదీలకు సంబంధించిన టోకెన్లను డిసెంబరు 10వ తేదీ ఉదయం 10 గంటలకు వన్ ప్లస్ త్రీ విధానంలో కేటాయించనున్నారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు రూ.4,500, తిరుమల స్థానికులకు 500 చొప్పున రోజుకు 5 వేల టోకెన్లు జారీ చేయనున్నారు. దీని కోసం కూడా ప్రత్యేక యాప్‌ను రూపొందించనున్నారు. ఇక, టీటీడీ ఉద్యోగులకు కూడా దర్శన విధివిధానాలను రూపొందించారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.23 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,615

తలనీలాలు సమర్పించినవారు: 27,722







మాడవీధుల్లో భక్తజనం - హోల్డింగ్ పాయింట్ నుంచి క్యూలో పుష్కరిణిలోకి..

తిరుచానూరు దిగ్బంధం

- వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల ఘటనతో అధికారుల అప్రమత్తం
- పంచమి తీర్థానికి పటిష్ట చర్యలు

తిరుచానూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ ప్రక్రియలో తిరుపతి నగరం బైరాగిపట్టెడ వద్ద తొక్కిసలాట నేపథ్యంలో అధికారులు పంచమితీర్థానికి అప్రమత్తమయ్యారు. పోలీసు, టీటీడీ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులే ఒకటికి నాలుగుసార్లు అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు, పార్కింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పర్యటించారు. తిరుచానూరు గ్రామాన్ని అష్టదిగ్బంధం చేశారు సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు తిరుచానూరులోకి వాహనాలను అనుమతించకుండా గ్రామ ముఖద్వారాల పోలీసు పికెట్లు ఏర్పాటుచేశారు. గ్రామంలోకి ప్రవేశించిన ప్రతి భక్తుడిని సోమవారం రాత్రి నుంచే హోల్డింగ్ పాయింట్లకు పంపారు. మంగళవారం ఉదయం 11గంటల వరకూ వచ్చిన ప్రతి ఒక్కరినీ షెడ్లకు పంపి.. విడతల వారీగా ప్రత్యేక క్యూలైన్ల ద్వారా పుష్కరిణిలోకి అనుమతించారు. టీటీడీ ఉద్యోగులు, ఇతర శాఖ ఉద్యోగులు ఎక్కడికక్కడ మీడియాను కూడా నిరోధించి 10గంటల తర్వాత పుష్కరిణిలోకి పంపారు. ఇలా ఎక్కడికక్కడ పటిష్ట చర్యలు తీసుకోవడంతో తొక్కిసలాట లేకుండా పుష్కరిణిలో భక్తులు స్నానాలాచరించారు. చిన్న చిన్న తోపులాటలు మినహాయించి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పంచమితీర్థం ముగిసింది. దీంతో వేలాది మంది భక్తులు తరలివచ్చినా ప్రశాంత వాతావరణంలో పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు పయనమయ్యారు. ఇక, సుపథం మహద్వారం వద్ద పెద్దసంఖ్యలో భక్తులు గుమికూడటంతో తోపులాట జరిగింది. భక్తులు కాస్త ఇబ్బందిపడ్డారు. పద్మావతి అమ్మవారి దర్శనానికి రాత్రి పొద్దుపోయే వరకూ భక్తులు బారులు తీరారు. వేలాది మంది తరలి వచ్చి పద్మసరోవరలో పుష్కర స్నానాలుచేశారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కలిసి జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులను అభినందించారు.



పుష్కరిణిలో భక్తులకు రక్షణగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



అన్ని దారులు పుష్కరిణి వైపే..

పద్మపుష్కరిణిలో స్నానమాచరించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. రాత్రి వరకూ దాదాపు లక్షమందికిపైగా భక్తులు తిరుచానూరుకు తరలిరావడంతో ఎటుచూసినా భక్తుల రద్దీనే కనిపించింది.

ఉదయం: అమ్మవారికి శ్రీవారి సారె



తిరుచానూరు వద్ద సారె ఊరేగింపు..

పంచమితీర్థం రోజున తిరుచానూరు పద్మావతిదేవికి శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిమళాన్ని విమాన ప్రాకారంలో తెల్లవారు జామున ఊరేగించారు. గర్భాలయంలో శ్రీవారి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. 4.30 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి సారె ఊరేగింపు మొదలైంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏకాంగులు, అర్చక పరిచారకులు కాలిబాటన అలిపిరికి చేరుకున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. అక్కడి నుంచి సారె తీసుకుని భారీ ఏనుగు అంబారీ మధ్య కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరు ముఖద్వారం వద్దనున్న పసుపు మండపానికి 10.15 గంటలకు తీసుకొచ్చారు. సారెకు ప్రత్యేక పూజలు చేశాక టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, సీవీఎస్వో మురళీకృష్ణ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి.. 10.56 గంటలకు పంచమితీర్థం మండపానికి తీసుకొచ్చారు.

- తిరుమల/తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శ్రీవారి ఆలయంలో

సాయంత్రం: బంగారు పద్మంపై పద్మావతి

చక్రస్నానం అనంతరం అమ్మవారిని పుష్కరిణికి ఎదురుగా ఉన్న గంగుండ్ర మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం శ్రీవారు పంపిన బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. సాయంత్రం 7.30 గంటలకు అమ్మవారు బంగారు పద్మంపై ఆశీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు.





నేడు: పుష్పయాగం

పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఏటా బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దుచేశారు.

రాత్రి: ధ్వజావరోహణం

మంగళవారం రాత్రి 10- 11 గంటల మధ్య ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అర్చకులు ధ్వజారోహణం రోజున ఎగురవేసిన గజపటాన్ని అవరోహణం చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆహ్వానించిన సకల దేవతలను, అష్టదిక్పాలకులకు బలినివేదన చేసి తిరిగి వారిని యథాస్థానానికి పంపించారు. ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న పాంచరాత్ర ఆగమ పండితులు, అర్చకులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలతో ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు. దీంతో ఈ నెల 17న ప్రారంభమై.. తొమ్మిది రోజులు వైభవంగా జరిగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేష్‌కుమార్, శాంతారామ్, జానకిదేవి, రంగశ్రీ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

సత్యవేడు రెవెన్యూ డివిజన్ హామీని నెరవేర్చండి సార్

- సీఎంకు ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి

సత్యవేడు/పిచ్చాటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... 2024 ఏప్రిల్ 20న ఎన్నికల బహిరంగ సభలో సత్యవేడును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తానని సత్యవేడు టవర్‌క్లాక్ సాక్షిగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం 2024 ఆగస్టు 19న శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన సమయంలో సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎంకు తాను వినతిపత్రం సమర్పించానని చెప్పారు. గత నెల కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ వినతి అందించానన్నారు. సత్యవేడు నియోజకవర్గం తమిళనాడు రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో పాటు దేశానికి తలమానికంగా ఉన్న శ్రీసిటీలో సుమారు 300 బహుళ జాతి కంపెనీలు, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన హీరో, అపోలో, కాప్రికాన్ వంటి బడా కంపెనీలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వీటన్నింటికి పరిష్కారం చూపాలంటే సత్యవేడు రెవెన్యూ డివిజన్ తప్పనిసరి అని ఎమ్మెల్యే వివరించారు. తన సత్యవేడు రెవెన్యూ డివిజన్ విజ్ఞప్తిని సీఎం పరిశీలించాలని కోరారు.

స్విమ్స్‌లో హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలు

తిరుపతి(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లోని మానసిక విభాగం ఆధ్వర్యంలో హైడిఫినిషన్ టీడీసీఎస్ ద్వారా అత్యాధునిక వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. మానసిక విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించిన హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలను ఆయన పరిశీలించారు. మెదడు నాడీకణాలపై



రోగులకు హైడిఫినిషన్ చికిత్సలు నిర్వహిస్తున్న డాక్టర్ గణేష్‌కుమార్

తక్కువ మోతాదులో విద్యుత్తు ప్రవాహాన్ని అత్యంత ఖచ్చితమైన మానిటరింగ్‌తో అందించే నాన్-ఇన్‌వేసివ్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ టెక్నిక్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అత్యాధునిక వైద్య పద్ధతులను రాష్ట్రంలోనే మొదటిసారిగా స్విమ్స్ మానసిక విభాగంలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇది మానసిక సమస్యలతో బాధపడేవారికి, మానసిక రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యూరాలజీ, ఫిజియోథెరపీ రంగాల్లో కూడా ఈ చికిత్సలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, మానసిక విభాగాధిపతి డాక్టర్ గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు





వేణుగోపాల స్వామి ఆలయం వద్ద సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

- తొలిదశలో ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మిస్తున్నారు. టీటీడీ రూ.40 కోట్ల బడ్జెట్‌తో ఔటర్‌రింగు రోడ్డు నుంచి నేపాలి చెక్‌పోస్టు మీదుగా పాపవినాశనం దాకా ఈ పనులు చేపట్టింది. తిరుమలకు వచ్చే భక్తుల్లో సగానికిపైగా పాపవినాశనం, జపాలి ఆంజనేయస్వామి, ఆకాశగంగ, వేణుగోపాల స్వామి ఆలయాలను సందర్శిస్తుంటారు. రెండు వరుసల రోడ్డు మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి.

తొలి దశలో : రింగురోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డిపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలుపెట్టారు. పాచికాల్వ బ్రిడ్జి పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. మఠాల నుంచి నేపాలి చెక్‌పోస్ట్ వరకు నాలుగులైన్ల సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు రోడ్డు నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. వేణుగోపాల స్వామి ఆలయం నుంచి ఆకాశగంగ వరకు అదనంగా రెండు లైన్ల నిర్మాణం కోసం దట్టమైన అడవిలో పనులు సాగుతున్నాయి. డిసెంబరు 31 నాటికి పనులు పూర్తిచేయాలని టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ప్రణాళికలు రూపొందించుకుంది. ఇక, ఆకాశగంగ నుంచి పాపవినాశనం వరకు ఉన్న రోడ్డు మార్గం ప్రభుత్వ ఫారెస్ట్ పరిధిలో ఉండటంతో నిర్మాణం కోసం ప్రభుత్వానికి టీటీడీ ఇప్పటికే లేఖ రాసింది. అనుమతులు లభించిన వెంటనే రెండవ దశలో ఈ రోడ్డు విస్తరణ పనులు కూడా మొదలుకానున్నాయి.

దక్కిలి 'విండో'కు పర్సన్ ఇంఛార్జి కమిటీ

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గం దక్కిలి సింగిల్‌విండోకు ప్రభుత్వం పర్సన్ ఇంఛార్జి కమిటీని నియమించింది. ఇప్పటి వరకూ అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీ కొనసాగుతుండగా ప్రభుత్వం దాని స్థానంలో అనధికార పర్సన్ ఇంఛార్జి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా వెలికంటి రమణారెడ్డి, సభ్యులుగా పిల్లి కృష్ణారెడ్డి, మెరిగ వెంకటస్వామిలను నియమించింది. కొత్తగా నియమించిన కమిటీ కాలపరిమితి వచ్చే ఏడాది జనవరి 30 దాకా వుంటుంది. ఆపై గడువు పొడిగించే అవకాశముంది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు పాలకవర్గం గడువు పొడిగింపు

శ్రీకాళహస్తి సహకార టౌన్ బ్యాంకు పర్సన్ ఇంఛార్జి కమిటీ కాలపరిమితిని మ రో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ఈనెల 28వ తేదీ నాటికి ముగిసిపోనుంది.దీంతో ఈనెల29వ తేదీ నుంచీ వచ్చే ఏడాది మే నెల 28వ తేదీ వరకూ కమిటీ కాలపరిమితిని పొడిగించింది.

హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందడుగు వేద్దాం..!

- మహిళల రక్షణకు 100, 181, 1901 హెల్ప్‌లైన్లు

తిరుపతి (రూరల్/విశ్వవిద్యాలయాలు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపడుతున్నాయని, తమకున్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ అధ్యాపకురాలు, ఎన్ఎ్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఫర్ ద ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ అగైనెస్ట్ ఉమెన్‌ని పురస్కరించుకుని జెండర్ సమానత్వంకోసం వర్సిటీ ఉమెన్‌స్టడీస్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేరూరు పంచాయతీలోని మహిళలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై జరిగే హింసను నిర్మూలించడానికి ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా ఈ దినోత్సవాన్ని ప్రకటించిందని, మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని హింసకి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. మౌనాన్ని వీడి మార్పువైపు అడుగులు వేయాలని, పరస్పర సహకారంతో సురక్షిత వాతావరణాన్ని ఏర్పరచుకోవాలన్నారు. ప్రస్తుతడిజిటల్ ప్రపంచంలో మహిళలపై హింస కొత్త రూపాలలో పెరుగుతోందని, మహిళలు ఎదుర్కొంటున్న భౌతిక, మానసిక, ఆర్థిక, సామాజిక, హింస రూపాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ అరాష్‌మెంట్, బెదిరింపులు, సైబర్‌స్టాకింగ్, డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ ఆధారిత హింసకు పాల్పడుతున్నారని, టెక్నాలజీ వినియోగంలో మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల చట్టపరమైన రక్షణ కోసం ప్రభుత్వం 100,181,1091 వంటి హెల్ప్‌లైన్ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చిందని, వీటిని సద్వినియోగించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పత్తిపాటి నాగేశ్వరరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రమేష్, వాహిని, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి, పక్కన ఏపీఎం నాగేశ్వరరావు తదితరులు

ఇలా చేస్తే పీఎం కిసాన్ లబ్ధి

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం కిసాన్ పథకం కింద కొందరు తమ ఖాతాల్లో నగదు జమ కాలేదని ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారు తమకు ఆర్థిక సాయం జమ కాకపోవడానికి కారణాలు తెలుసుకుని సరిదిద్దుకుంటే తిరిగి లబ్ధి చేకూరుతుందని అధికారులు సూచిస్తున్నారు.

● కొందరు రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేసుకోలేదు. వారు ఇప్పుడైనా ఈకేవైసీపీ పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. మీ సేవా కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్స్(సీఎస్‌సీ)లలో వేలిముద్ర లేదా ఐరిష్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన 30 నుంచి 60 రోజుల్లో ఎన్‌పీసీఐ లింక్ ఉన్న బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

● రైతు ఆధార్‌కి పట్టాదారు పాసుబుక్ లింక్ కాకపోయినా పథకం కింద లబ్ధి చేకూరదు. గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ దగ్గర పట్టాదారు పాసుపుస్తకానికి సంబంధించిన ఆధార్ లింక్ అప్లికేషన్ పూర్తి చేయాలి. వేలిముద్ర లేదా ఓటీపీతో లింక్ అభ్యర్థనను వారు తహసీల్దార్ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ పూర్తయిన తరువాత గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఈవిషయం తెలియజేయాలి. వారు మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా కార్యాలయానికి రైతు వివరాలను పంపిస్తారు.

● రైతు బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానం కాకపోయినా ఆర్థిక సాయం జమకాదు. రైతు చివరగా తెరిచిన బ్యాంకులో ఎన్‌పీసీఐ లింకు చేయించాలి. లేదా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకులో కొత్త ఖాతాను ఓపెన్ చేస్తే ఎన్‌పీసీఐ లింక్ అవుతుంది. రైతుకు ఎన్‌పీసీఐ లింక్ అయినప్పటి నుంచి 30 రోజుల నుంచి 90 రోజుల వ్యవధిలో పథకం కింద నగదు జమ అవుతుంది.

● 2019 ఫిబ్రవరి తరువాత భూమి మ్యూటేషన్ జరిగిన వాటికి పీఎం కిసాన్ వర్తించదు. భార్యాభర్తల్లో ఒకరు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతూ మరణిస్తే నామిని తన పేరిట రికార్డులో తన పేరు మార్చుకుని దరఖాస్తు చేస్తే అర్హత పొందవచ్చు. ఈ సంవత్సరం మొదటి విడతలో కూడా కొందరికి నగదు జమ కాలేదు. ఒకే కుటుంబంలో ఇద్దరు లబ్ధిదారులు ఉన్నారనే అనుమానంతో ఇలా జరిగింది. ఫీల్డ్ వెరిఫికేషన్ తరువాత వారికి నగదు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

● పీఎం కిసాన్ పథకానికి కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్‌దారులు, ఆదాయ పన్ను చెల్లించేవారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు అనర్హులని గుర్తించాలి.

స్మార్ట్ కార్డు తీసుకున్నారా?

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులను మూడు నెలల కిందట అందుబాటులోకి తెచ్చింది.32 మండలాల్లో పంపిణీ కోసం 5, 27, 680 కార్డులు జిల్లాకు చేరగా వీటి పంపిణీ బాధ్యతను రేషన్ డీలర్లకు, గ్రామ సచివాలయ సిబ్బందికి అప్పగించారు.వీటిలో ఇంకా 37, 634 కార్డులు మిగిలిపోయాయి.ఆయా కార్డుదారులు ఉన్నారా లేదా అని అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నెల 30 తరువాత వాటిని తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరచాలని అధికారులు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో గృహాల మ్యాపింగ్ ప్రక్రియ సక్రమంగా జరక్కపోవడంతో ఒక ప్రాంతంలో వారికి మరోప్రాంతంలోని చౌకదుకాణాల్లో కార్డులు ఉండటంతో స్మార్ట్‌కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది. తమ కార్డులు ఎక్కడున్నాయో తెలియక వేలాదిమంది ఎదురు చూస్తున్నారు.

● **ఇవీ ప్రధాన ఇబ్బందులు..**

16, 94, 463 యూనిట్లలో 75, 606 మంది ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. ఈకేవైసీ ప్రక్రియ నత్తనడకన కొనసాగడమే ఇందుకు కారణం. చాలా మంది లబ్ధిదారులకు కార్డులు ఎక్కడిస్తారో తెలియక చౌకదుకాణాలు,సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు లబ్ధిదారుల వివరాలు సరిగా తె లియక చాలా కార్డులు డీలర్లు, సచివాలయాల వద్దే మిగిలిపోయాయి. మరో వైపు ఈకేవైసీ ప్రక్రియ పూర్తికాకపోవడంతో కార్డుల్లో మృతుల వివరాలు, వివాహమై అత్తారింటికి వెళ్లిన వారి పేర్లు అలాగే కొనసాగుతున్నాయి.

● **వెనుకబడ్డ పెనుమూరు**

మొత్తం 5, 27, 680 స్మార్ట్ కార్డుల్లో ఇంతవరకూ 1, 59, 427కార్డులు సచివాలయాల ద్వారా, 3, 30, 619 కార్డులు చౌకదుకాణాల ద్వారా పంపిణీ అయ్యాయి.37,634 కార్డులు పంపిణీకి నోచుకోలేదు.96.64 శాతం పంపిణీతో నగరి మండలం ముందుండగా 87.54శాతంతో పెనుమూరు చివర్లో వుంది. గంగవరంలో 95.05శాతం, గుడుపల్లెలో 95.92, పెద్దపంజాణిలో 95.16, రొంపిచెర్లలో 95.96, తవణంపల్లెలో 95.27,యాదమరిలో 95.53,విజయపురంలో 95.64,పుంగనూరులో 88.19, రామకుప్పంలో 89.88 శాతం కార్డుల పంపిణీ జరిగింది.

30వ తేది వరకే అవకాశం



అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు: టీడీపీ

చిత్తూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నదాత అభివృద్ధికి ప్రభుత్వం పంచసూత్రాలతో పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు, అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం పటిష్టమైన పంచసూత్ర ప్రణాళికతో ముందుకు కదులుతోందన్నారు. 'నీటి భద్రత, ప్రకృతి సేద్యం, టెక్నాలజీ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ సాయం' అనే పంచసూత్రాలతో రైతే రాజుగా ఉండే రాష్ట్రాన్ని నిర్మించడమే సీఎం చంద్రబాబు సంకల్పమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ఐటీ నిపుణుల సాధించిన గుర్తింపును ఏపీ రైతులు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అన్నివిధాలా విధ్వంసానికి గురైందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందనడానికి నిధుల విడుదలే నిదర్శనమని చెప్పారు. కాగా రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు.

6న పలమనేరులో బాలోత్సవం



గోడ పత్రికలను విడుదల చేస్తున్న బాలల దినోత్సవ కమిటీ

పలమనేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 6వ తేదీన శనివారం పలమనేరులో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి. తులసీనాథం నాయుడు, యుగంధర్ బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం కళామందిరంలో ఆవిష్కరించారు. ఫ్యాన్సీ డ్రస్, శాస్త్రీయ నృత్యం, పద్యాలు చెప్పడం, దేశభక్తి గేయాల గీతాలాపన, జానపద గీతాలాపన, ఏకపాత్రాభినయనం, జ్ఞాపకశక్తి పోటీల, కథలు చెప్పడం, వార్తా పత్రికల పఠనం, వక్తృత్వం, గజిబిజి సరిచేయడం, తెలుగులోనే మాట్లాడటం, బొమ్మలు గీయడం, చదరంగం వంటి అంశాలలో నాలుగు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలల నుంచి మాత్రమే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 1వ తేదీలోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్లను సమీకరించి తమకు అందించాలని కోరారు.

చెరకు రైతులకు గిట్టుబాటు ధర

● ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్

శ్రీరంగరాజపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెరకు రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ జయమురుగన్ చెప్పారు. సోమవారం నెలవాయిలోనే ఫ్యాక్టరీలో చక్కెర క్రషింగ్‌ను ఆయన ప్రారంభించారు. చెరకు సరఫరా, చెల్లింపు వివరాలను తెలుసుకునేందుకు రూపొందించిన రుద్ర యాప్‌ను మేనేజింగ్ డైరెక్టర్ అనిత, రాజేంద్ర మదన గోపాల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జయమురుగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చెరకుకు ఎఫ్ఆర్‌ఎఫ్ ధర రూ.3290.50గా నిర్ణయించిందన్నారు. ఫ్యాక్టరీకి చెరకు సరఫరాకు అయ్యే రవాణా వ్యయాన్ని పూర్తి ఫ్యాక్టరీ చెల్లిస్తుందన్నారు. చెరకు అధిక ఉత్పాదకతకు ఉచితంగా ఒక యూరియ బ్యాగు, గ్యాస్ ఫిల్లింగ్‌కు 500 చెరకు మొక్కలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సలహాదారు క్రిష్ణన్, సీఎఫ్‌వో మాతప్పన్, వైస్ ప్రెసిడెంటు రాధక్రిష్ణన్, హెచ్‌వోడి గోవిందరాజు, జీఎం గిరి, ఏవోలు హరిక్రిష్ణ, దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చెరకు క్రషింగ్ ప్రారంభ కార్యక్రమంలో చైర్మన్ జయ మురుగన్

కాణిపాక ఆలయ ఈవో పదవీ కాలం పెంపు



కిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవో పెంచలకిషోర్ పదవీ కాలాన్ని మరో ఏడాది పెంచారు. ఆయన రెవెన్యూ శాఖ నుంచి దేవదాయ శాఖకు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. వచ్చే నెల 6 వరకు ఈవోగా కొనసాగేందుకు వ్యవధి ఉంది. ఈక్రమంలో మరో ఏడాది కాలపరిమితి పెంచారు.

నేడు ఆనందగిరిలో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు



ఆనందగిరి వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

పాకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :పాకాల సమీపంలోని ఊట్లవారిపల్లె వద్ద ఆనందగిరి (పాళ్యం కొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ ఎస్.చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఉదయం 8-30 నుండి 11-30 గంటలవరకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని, ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

నేడు ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలానీ తిరుపతికి రానున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును సందర్శించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు





బోరు మోటరు, పైపులను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు - ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతూనే ఉన్నారు. మండలంలోని దేవళంపేట పంచాయతీలో సోమవారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. అక్కడినుంచి నాయనిచెరువు మార్గంలో పెనుబాలవారిపల్లి వద్దకు చేరుకొని పలు పంటలను, పైపులను నాశనం చేసింది. చిన్ననగరిలోని మామిడి తోటల్లోని కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకుంది. మంగళవారం పగలంతా సూరప్పచెరువు వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

ఓటరు క్లైయిముల పరిష్కారంలో ఫస్ట్

● డీఆర్వో మోహన్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన క్లైయిమ్‌ల పరిష్కారంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 1776 పోలింగ్ స్టేషన్లు ఉండగా పాత భవనాలు, కూలిపోయే స్థితిలో ఉన్న భవనాల నుంచి 11 స్టేషన్లను మరో చోటికి మార్పుకు ప్రతిపాదించామన్నారు. మరో 68 పోలింగ్ స్టేషన్ల పేర్లు మార్చుతామన్నారు. 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా అదనపు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. 2002-2025 ఓటర్ల జాబితా ప్రకారం సర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్(టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు(బీజేపీ), పరదేశి(కాంగ్రెస్), గంగరాజు(సీపీఎం); ఉదయ్‌కుమార్‌రెడ్డి(వైసీపీ), కల్లూరు సుబ్రహ్మణ్యం(ఆమ్ ఆద్మీపార్టీ), సురేంద్రబాబు(బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో ఆ ముగ్గురిపై కేసు నమోదు

పాలసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తనను ఆరు నెలలుగా వేధిస్తున్నారంటూ సువర్ణ అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శరవణకుమార్(ఆంధ్రప్రభ కంట్రిబ్యూటర్), గురుప్రసాద్ (హ్యూమన్‌రైట్స్ మెంబరు), నవీన్‌నాయుడు(ఆర్మీ ఉద్యోగి) కలసి తనను వేధిస్తున్నారని సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫీల్డ్ అసిస్టెంట్ సువర్ణ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

రోస్టర్ ప్రకారం పదోన్నతులు, నియామకాలు చేపట్టాలి



సదరన్ డిస్కం సీఎండీని సత్కరించిన బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో ఖాళీగావున్న సబ్ ఇంజనీర్లకు రిజర్వేషన్ రోస్టర్ మేరకు పదోన్నతులు కల్పించాలని, షిఫ్ట్ ఆపరేటర్ల నియామకాల్లో రోస్టర్ పాటించాలని సీఎండీ లోతేటి శివశంకర్‌ను బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలో వారు సీఎండీని మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సీఎండీని కలసినవారిలో నాయకులు పి.వి.మురళి, ఎల్.చలపతి, కరీముల్లాఖాన్, సి.వి.వేణు ఉన్నారు.

తాతయ్యగుంట గంగమ్మకు రూ.6లక్షల విరాళం



మహేష్‌యాదవ్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే, ఆర్యవైశ్యసంఘ ప్రతినిధులు

తిరుపతి అర్బన్ / తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి ఆర్యవైశ్యసంఘ ఆధ్వర్యంలో మంగళవారం రూ.6,01,116 విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో సంఘ అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, నేతలు కలసి ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్‌కు చెక్కుని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ విస్తరణకు అవసరమైన స్థలం కొనుగోలు కోసం ఆర్యవైశ్యులు విరాళాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. నరసింహులు మాట్లాడుతూ.. గతంలో అమ్మవారి ఆలయ కుంబాభిషేక సమయంలో శిఖరాన్ని బంగారుతాపడం చేసే అదృష్టం తమ సంఘానికి కలిగిందని, వాసవీమాత ఆశీస్సులతో భవిష్యత్‌లోనూ గంగమ్మ ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. జనసేన నాయకులు రాజారెడ్డి, సంఘనేతలు సుకుమార్, రమేష్, శ్రీరాములు, సురేష్, మధుసూదన్, రామ్మూర్తి, రమేష్, సందీప్, చంద్రశేఖర్, సుష్మ, శేఖర్, శ్రీదేవి, మహేష్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో విద్యార్థుల మాక్ అసెంబ్లీ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌సమావేశ మందిరంలో మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో మాక్ అసెంబ్లీ నిర్వహణకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున 21 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఎనిమిది మంది రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో అసెంబ్లీ సమావేశ మందిర ఆవరణలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొంటారు. మిగిలిన 13 మంది విద్యార్థులు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంతో పాటు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవ కార్యాక్రమాలతో పాటు మాక్ అసెంబ్లీ వంటి కార్య క్రమాలు చేపట్టనున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి: రామచంద్రయాదవ్

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం యూనియన్ అధ్వర్యంలో భారీ ఎత్తున సీపీఎస్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు హాజరైన రామచంద్రయాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో 2019కి ముందు అధికారంలోకి రావడానికి అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సీపీఎస్ విధానాన్ని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రద్దు చేస్తానని హామీ ఇచ్చి ఉద్యోగుల పట్ల నయవంచనకు పాల్పడ్డారని విమర్శించారు. ఆ తర్వాత ఐదేళ్ల పాలనలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేయకుండా కాలాయాపన చేశారని విమర్శించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు కూడా సీపీఎస్ ఉద్యోగులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


ఖోఖోలో చిత్తూరుకు ద్వితీయ స్థానం

విజయనగరం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో జరిగిన 69వ అండర్-17 బాలికల ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో తూర్పు గోదావరి జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో చిత్తూరు, విజయనగరం జట్లు నిలిచాయి. మంగళవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో తూర్పు గోదావరి ఏడు పాయింట్లు, చిత్తూరు ఆరు పాయింట్లు సాధించాయి. నందిని ఆల్‌రౌండ్ ప్రదర్శనతో తూర్పు గోదావరి జట్టు గెలుపొందడంలో కీలక భూమిక పోషించింది.

గూడూరు.. తిరుపతిలోనే!

వెంకటగిరి పూర్తిగా జిల్లాలోకే

34 నుంచి 37కు పెరగనున్న మండలాలు



తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలు, డివిజన్ల పునర్విభజనపై మంత్రుల కమిటీ సిఫారసులపై సీఎం చంద్రబాబు తుది నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో స్వల్ప మార్పులు మినహా జిల్లా యథాతథంగా కొనసాగనుంది. వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాల విలీనంతో పూర్తిగా జిల్లాలో చేరనుంది. దీంతో ప్రస్తుతం 34గా ఉన్న మండలాల సంఖ్య 37కు చేరనుంది. తద్వారా రాష్ట్రంలోని అతిపెద్ద జిల్లాల్లో ఒకటిగా తిరుపతి ఆవిర్భవించనుంది.

● గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో ఆ ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. దీంతో గూడూరు తిరుపతిలోనే కొనసాగనుంది. క్రిస్ సిటీ, శ్రీసిటీ, సాగరమాల రోడ్ ప్రాజెక్టులు వంటివి ఒకే జిల్లాలో ఉంటే అభివృద్ధికి అవకాశముంటుందని ప్రభుత్వం భావించడం వల్లే ఈ నిర్ణయానికి కారణమైందని తెలిసింది.

● నగరి నియోజకవర్గానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో ఉన్న నగరి, విజయపురం, నిండ్ర మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసే ప్రతిపాదనను పక్కన పెట్టినట్టు సమాచారం.

● వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రాపూరు, కలువాయి, సైదాపురం నెల్లూరు జిల్లాలోనూ, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి తిరుపతి జిల్లాలోనూ ఉన్నాయి. మంత్రుల కమిటీ చేసిన సిఫారసుల మేరకు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసేందుకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారు.

● నెల్లూరు జిల్లా నుంచి చేరనున్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు సీఎం అంగీకరించారు. ఫలితంగా ఇప్పటి దాకా ఎనిమిది మండలాలతో కూడిన గూడూరు రెవిన్యూ డివిజన్ ఇకపై 11 మండలాలకు విస్తరించనుంది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రోడ్డు విస్తరణ పనులకు సహకరించండి



వడ్డిపల్లెలో పర్యటిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్ ప్రజలను కోరారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని వడ్డెపల్లె-కొత్తపేట రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి వారు మంగళవారం ఆయా ప్రాంతాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలు, సూచనలు, సలహాల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రజలు సహకరిస్తే వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ఇది దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, కౌన్సిలర్ కస్తూరి వేలు, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, అప్పు ముఖేశ్, మణి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు సీబీఎస్ఈ గుర్తింపు

కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు సీబీఎస్ఈ గుర్తింపు వచ్చినట్లు ఎస్వీ గ్రూప్ అధినేత బీఎం.దయానిధి తెలిపారు. ఇటీవలే సీబీఎస్ఈ తనిఖీ కమిటీ తమ స్కూల్‌ను సందర్శించి అన్ని వసతులు ఉన్నట్లు సంతృప్తి చెందడంతోనే గుర్తింపు లభించినట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించడమే ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

సహాయ పరికరాల గుర్తింపు శిబిరానికి స్పందన



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

గుడుపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన వికలాంగ, వృద్ధులకు సహాయక పరికరాల గుర్తింపు శిబిరానికి విశేష స్పందన లభించింది. కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రూరల్, గుడుపల్లె నుంచి 423 మంది శిబిరానికి హాజరైనట్లు తహసీల్దారు సీతారామ్ తెలిపారు. హాజరైన వారి నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులు అందించిన వారికి అవసరమైన సహాయ పరికరాలను ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. హాజరైన వారికి భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస రాజు, ఎంపీడీవో రాధాకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో రవిచంద్ర, ఏఎంసీ చైర్మన్ మునిరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, హేమాంబర్ గౌడ్, బేటప్ప నాయుడు, బాబు, భానుమూర్తి, అమీర్, మంజునాథ్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కుప్పంలో అభివృద్ధి పరుగులు: సురేష్



సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయని పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు అన్నారు. మంగళవారం రామకుప్పం శివార్లలోని తిమ్మసముద్రం వద్ద ఉన్న డా.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఆవరణలో సీసీ రోడ్ల నిర్మాణపు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్నిరంగాలతోపాటు విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మహ్మద్ రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు మురళీ తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శిగా హరి



పలమనేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు జిల్లా పలమనేరు మండలం సముద్రపల్లి పంచాయతీ కార్యదర్శి సిరిపురం హరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ తనను ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సంఘ అభివృద్ధి, పంచాయతీ కార్యదర్శుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. పలమనేరు ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ హరికి అభినందనలు తెలిపారు.

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలి



ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రామకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ మైనారిటీసెల్ మండల అధ్యక్షుడు ఆదిల్ తెలిపారు. మంగళవారం రామకుప్పం పట్టణ ప్రధాన రహదారిలో ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం మొదటగా కుప్పం నియోజకవర్గంలో సంజీవని కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారన్నారు. 46 రకాల రక్తపరీక్షలు నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. నేతలు అమరనాథ్, మిఠాయిరాజా, చాంద్‌బాషా, గోవిందప్ప, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వైసీసీ కౌన్సిలర్ల గైర్హాజరు



సమావేశానికి హాజరైన నలుగురు కౌన్సిలర్లు

పలమనేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, బడ్జెట్ సమావేశాలకు వైసీపీకి చెందిన చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు గైర్హాజరు కావడంతో సమావేశాలు వాయిదా పడ్డాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం, 12 గంటలకు బడ్జెట్ సమావేశాలు జరగాల్సి ఉండగా వైసీపీకి చెందిన వారు గైర్హాజరయ్యారు. ఇద్దరు టీడీపీ మహిళా కౌన్సిలర్లు సునీత, శారదలతో పాటు వైసీపీలో గెలిచి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీపీ లో చేరిన కుమార్‌శెట్టి, కిరణ్‌కుమార్ మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశాలు వాయిదా పడ్డాయి.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.భాస్కర్

గంగవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న ఆఘాయిత్యాలను అరికట్టి వారికి రక్షణ కల్పించేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం గంగవరంలోని వెలుగు కార్యాలయం వద్ద అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారం, హేళన చేయడం లాంటి వాటికి విముక్తి పలికి ప్రతి మహిళ గౌరవంగా బతికేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, ఆరీఫుల్లా , వెలుగు సీసీలు ఎంసీ బాబు, చక్రపాణి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణవంశీ

పుంగనూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలను లైంగిక వేధింపులకు గురిచేసినా, అగౌరవంగా ప్రవర్తించినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణవంశీ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కోర్టులో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే దిశలో పయనించాలని సూచించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడమే కాకుండా ప్రభుత్వపరంగా అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు చెన్నకేశవులు, మల్లిఖార్జునరెడ్డి, వీరమోహన్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పుంగనూరు ఎక్సైజ్ ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని నిర్వహించి మత్తు పదార్థాలు వాడకంతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ ఎక్కడైన విక్రయాలు, వాడకం జరిగినట్లు తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ 14500 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు, లెక్చరర్లు భవాని, రాధాకృష్ణ, విజయకుమారి, ఎక్సైజ్ సిబ్బంది శ్వేత, రాజేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ విజేతలకు సన్మానం



క్రీడాకారులను సత్కరించిన విజయవాణి విద్యా సంస్థల అధినేత నాయుని చంద్రశేఖర్‌మూర్తి

చౌడేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అండర్-17 బాలికల కబడ్డీ రాష్ట్ర విజేతలైన చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులను విజయవాణి విద్యా సంస్థల అధినేత నాయుని చంద్రశేఖర్‌మూర్తి ఘనంగా మంగళవారం సన్మానించారు. కర్నూల్‌లో జరిగిన గత వారం రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజయం సాధించిందన్నారు. మండలంలోని పుదిపట్ల హైస్కూల్‌లో విజేతలను మెడల్స్, శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, విశ్రాంతి పీడీ రామచంద్ర, రోటరీ క్లబ్ అధ్యక్షులు గణేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదాత కళ్లలో ఆనందమే లక్ష్యం

● వైసీపీ పాలనలో కీలకమైన పథకాలన్నీ నిర్వీర్యం ● రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు: రంగినాయనిపల్లిలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటమునిరెడ్డి

పెద్దపంజాణి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పూర్వవైభవం తీసుకొచ్చి అన్నదాత కళ్లల్లో ఆనందం నింపడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దపంజాణి మండలంలోని శివాడి గ్రామంలో రైతన్నా-మీకోసం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఆదర్శవంతమైన అభివృద్ధిని అందిస్తున్నామన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదాతల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టబోతోందన్నారు. రైతన్నల కోసం ఈనెల 29 వరకు గ్రామాల్లో వివిధ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. వైసీపీ పాలనలో బిందు సేద్యంతో పాటు యాంత్రీకరణ, రాయితీలో వ్యవసాయ పనిముట్లు పంపిణీ తదితర పథకాలన్నీ మూలన పడేశారన్నారు. కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, తహసీల్దారు హనుమంతు, ఎంపీడీవో బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీరాములు, సీఈవో రామరాజు, సర్పంచ్ లలితమ్మ, ఏవో హేమలత, నాయకులు విజయభాస్కరరెడ్డి, మురహరిరెడ్డి, జయరామిరెడ్డి, నాగరాజరెడ్డి, నందగోపాల్, నాగరాజ, మురళీ, ముబారక్ దిలీప్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతు పక్షపాత ప్రభుత్వం



శాంతిపురం మండలం దండికుప్పంలో పాల్గొన్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రైతుల పక్షపాత ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం శాంతిపురం మండలం దండికుప్పం, రామకుప్పం మండలం మిట్టపల్లె గ్రామాల్లో రైతన్నా-మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులు మోసానికి గురై అష్టకష్టాలపాలయ్యారన్నారు. రామకుప్పం మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పవన్‌కుమార్, నేతలు విజయ్‌కుమార్‌రెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాసులు, అల్లీశీన, మునిరెడ్డి రైతుసేవా కేంద్రాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు మండలం మొరం పంచాయతీ రంగినాయనిపల్లి గ్రామంలో మంగళవారం రైతు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతన్నా మీకోసం కరపత్రాలను బయప్పగారిపల్లి సింగిల్ విండో అధ్యక్షులు వెంకటమునిరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో అపరిశుభ్రతపై పీకేఎం ఉడా చైర్మన్ ఆగ్రహం



చెత్త ఊడుస్తున్న సురేష్‌బాబు, రజనీకుమార్

రామకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని తిమ్మసముద్రం వద్దనున్న డా. బీఆర్. అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నెలకొన్న అపరిశుభ్రత వాతావరణంపై పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆయన విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయం ఆవరణలో, విద్యార్థుల వసతి గదుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆయన తానే స్వయంతో చీపురు చేతబట్టి ఊడ్చారు. అంతలో అక్కడకు వచ్చిన ప్రిన్సిపాల్ రజనీకుమార్‌పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గదుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉంటే ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు అందడం లేదని, దీంతో వారు తరచూ విధులకు హాజరు కావడం లేదని ప్రిన్సిపాల్ ఆయనతో చెప్పారు. ప్రిన్సిపాల్‌చే చీపురు పట్టించి చెత్తచెదారాన్ని శుభ్రం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జీ రవిరెడ్డి, మైనారిటీసెల్, ఎస్సీసెల్ అధ్యక్షులు ఆదిల్, హరీష్, నేతలు పాల్గొన్నారు.

పెద్దఉప్పరపల్లె వైద్యశాల తనిఖీ



పెద్దఉప్పరపల్లెలో వైద్యసిబ్బందితో డ్యిపూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్

సోమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశకార్యకర్తలు నిర్వహిస్తున్న ప్రత్యేక సర్వే రికార్డులు, ల్యాబ్‌లను పరిశీలించారు. క్షయవ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీపీఎంవో తిరుజ్ఞానం, వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, ఆరోగ్యవిస్తరణాధికారి ఉదయభాస్కర్, చంద్రమ్మ, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలి



విద్యార్థులలో మాట్లాడుతున్న సబ్జుసాబ్

వి.కోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఉర్దూ విభాగం పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టరు సబ్జుసాబ్ కోరారు. మంగళవారం ఆయన వి.కోటలోని ఉర్దూ ఉన్నతపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి క్రమశిక్షణ, పట్టుదలలతో చదవి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు 100 రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి విద్యార్థును పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



సర్పదోష నివారణ పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం నాగుల పంచమి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్టకు భక్తులు పూజలు, చేసి పాలు, పండ్లు సమర్పించుకున్నారు. పలు కుటుంబాల వారు అక్కడ నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. మధ్యాహ్నం ఆలయంలో సర్పదోష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులచే వేదపండితులు దోష నివారణ పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

మత్తు పదార్థాలపై అవగాహన



కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ తులసీరాం

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తులసీరాం తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మత్తుమందులు, మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల నుంచి వినతుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న పరిశీలకులు నాగేశ్వర్ నాయుడు

చౌడేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తల నుంచి 60 వినతులు స్వీకరించినట్లు అబ్జర్వర్ పాల ఏకిరి కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ కందూరి నాగేశ్వర్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ..మండలంలోని టీడీపీ కార్యకర్తలు పలు సమస్యలపై వినతులు అందాయన్నారు. మంత్రి నారా లోకేష్ స్వయంగా తీసుకుని పరిష్కరించనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు చౌడేపల్లెలోని శ్రీనివాస కల్యాణ మండపంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్ష, మండల కమిటీ ఎన్నికలు జరుగుతాయని అందరూ హాజరు కావాలని కోరారు.

టీడీపీలో కష్టపడిన వారికే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన వారికే గుర్తింపు, గౌరవం ఉంటుందని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. పులిచెర్ల సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో మంగళవారం మండల తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గం ఎంపిక చేపట్టారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు దక్కుతాయని తెలిపారు. టీడీపీ ఎన్నికల పరిశీలకులు రామకృష్ణమాచారి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుంగనూరులో ఏకగ్రీవం



వనమలదిన్నెలో నిర్వహిస్తున్న పరిశీలకుడు ప్రతాప్‌రాజు

●పుంగనూరు : పుంగనూరు రూరల్ మండలంలో గ్రామ తెలుగుదేశం పార్టీ కమిటీలకు ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించినట్లు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, ఎన్నికల పరిశీలకలకులు ప్రతాప్‌రాజు తెలిపారు. మంగళవారం మండలంలోని పలు పంచాయతీల్లో నిర్వహించిన ఎన్నికల సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరును సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. వనమలదిన్నె కమిటీ అధ్యక్ష పదవికి 7మంది పోటీ పడగా అందులో గిరిబాబునాయుడు, విరూపాక్షి నాయుడు చివరికి మిగలగా విరూపాక్షి చెరువు సంఘ అధ్యక్షుడిగా ఉన్నారని కొందరు చెప్పారు. ఇద్దరిలో ఒకరిని ఎన్నుకోవాలన్నారు. ఆరడిగుంటలో రామకృష్ణ, రెడ్డెప్పలు పోటీ పడ్డారు. చదళ్ల అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరువైపులా గోతులతో ఇక్కట్లు


వెదురుకుప్పం-దేవళంపేట రోడ్డు పక్కన దుస్థితి ఇది

వెదురుకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం-దేవళంపేట మీదుగా ఎస్‌ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్టకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా గోతులు ప్రమాదకరంగా తయారయ్యాయి. అసలే రోడ్డు సన్నంగా ఉంటుంది. ఎదురుపడిన వాహనానికి దారి ఇవ్వడానికి లేదా ముందు వెళ్తున్న వాహనం అధిగమించే ప్రయత్నంలో పక్కకు దిగడం పెద్ద సవాలుగా మారింది. ఏమాత్రం జాగ్రత్తగా దించకపోయినా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి తోలి చదును చేయాలని వారు కోరుతున్నారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా అడుగులు


సమావేశంలో మాట్లాడుతున్న జయకుమార్

చిత్తూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా సంస్థాగత నిర్మాణాన్ని చేపడుతున్నామని మాజీ ఎంపీ, ఏఐసీసీ జిల్లా పరిశీలకులు జయకుమార్ చెప్పారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన సంస్థాగత కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడి ఎంపికకు డిసెంబరు 3వ తేది వరకు జిల్లాలో పర్యటిస్తామన్నారు. కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, రాష్ట్ర నాయకులు రాంగోపాల్‌రెడ్డి, దామోదర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీ భవనాల పరిశీలన


అధ్యాపకులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

పాలసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాలనుజడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు మంగళవారం పరిశీలించారు. భవనాలువర్షం కురిస్తే ఉరుస్తుండటంతో కళాశాల ప్రిన్స్‌పాల్ హేమలత, ప్రభుత్వ విప్ థామస్‌లు ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తెచ్చారు. ఈక్రమంలో సీఈవో పరిశీలించారు. ఉరుస్తున్న తరగతి గదుల మరమ్మతులకు అంచనాలు తయారు చేసి వెంటనే పంపించాలని పీఆర్ ఈఈ నవీన్‌కుమార్‌కు ఆయన సూచించారు. ఎంపీడీవో షతీష్, పీఆర్ ఏఈ జయరాజ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సోషల్ ఆడిట్ పక్కాగా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మోహన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల స్థాయి ప్రతిభా విశ్లేషణ, సోషల్ ఆడిట్‌లు పక్కాగా చేపట్టాలని ఎంఈవో-2 మోహన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ మాస్టర్ ట్రైనీలకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు, 42 మంది సీఆర్‌ఎంటీ పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల వివరాలను పరిశీలించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్

విజయపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కోసలనగరంలో బ్లాక్ సీలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు భూముల గుర్తింపు కార్యక్రమం పగడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కిరణ్ సూచించారు. భూముల సర్వేపై రెవిన్యూ మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సీ బ్లాక్‌లో 476 ఎకరాలు గుర్తించాలన్నారు.ఈ భూములకు సంబంధించి సమగ్రంగా వివరాలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ధనుంజయులు, ఆశ్వస్థామా, లోకేష్, మాదవీలత, రిషివర్మ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

ఐరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని లీగల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లుప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ బేబీశ్వరరెడ్డిలు సూచించారు. మంగళవారం కళాశాలలో మత్తుపదార్థాల దుర్వినియోగం, బాలల హక్కుల పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ యుక్త వయసులో చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. మురళి, ఏఎస్ఐ శ్రీనివాసులు, మహిళా పోలీస్ రాజేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయికి పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం నాదముని, ఫిజికల్ డైరెక్టర్ కిషోర్‌కుమార్‌తు మంగళవారం ఈ విషయం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్యశేఖర్ ఆధ్వర్యంలో అభినందించారు. సీనియర్ విభాగంలో రగ్బీ పోటీలకు సాయికిరణ్, యామిని, ఇంద్రజ, నెట్ బాల్ పోటీలకు వినాయక, పావని,సాయి, ఆకాష్, వెంకటసాయి, బేస్ బాల్ పోటీలకు రమ్య, కీర్తన ఎంపికయ్యారు. అభినందన సభలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


కల్యాణి

చిత్తూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం డిప్యూటీ తహసీల్దార్ కల్యాణి చిత్తూరు రూరల్ మండల తహసీల్దార్‌గా నియమితులయ్యారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలో ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జయప్రకాష్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. కల్యాణి మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆమెను సిబ్బంది కలిసి అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



చిత్తూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తేనబండవాసులకు నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారధి నాయుడు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటి సమీపాన నివసిస్తున్న ఇక్కడి ప్రజలు చలికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని దుప్పట్లు అందజేశామని ఆయన చెప్పారు. సుమారు 200 మందికి పైగా దుప్పట్లు పంపిణి చేశారు. గుడులు, వంతెనల కింద వున్న యాచకులకు కూడా ఆ బెడ్‌షీట్లు పంపిణి చేశారు. తేనబండ కాలనీవాసులు పార్థసారధినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన రవీంద్రయ్య

తవణంపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఐరాల మండలం పుత్రమద్ది హరిజనవాడకు చెందిన కె.రవీంద్రయ్య(59) మంగళవారం చిత్తూరు నుంచి స్కూటీపై స్వగ్రామం వెళుతున్నాడు. బెంగళూరు-తిరుపతి హైవేపై కాణిపాకపట్నం సమీపంలో ఓ కారు వెనుక నుంచి ఢీకొనడంతో రవీంద్రయ్య రోడ్డుపై పడిపోయడు. అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


దాతకు రశీదు అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరసిద్ధుడి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన సిద్ధిసాయి మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు,తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

చెరకు రైతులను ఆదుకోండి

నగరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెరకు రైతులను ఆదుకోవాలంటూ నగరి, నిండ్ర, విజయపురం మండలాల చెరకు రైతులు ఎస్‌ఎన్‌జీ చక్కెర కర్మాగార చైర్మన్ జయ మురుగన్‌ను కోరారు. వారి సమస్యలపై ఆయన స్పందిస్తూ 4.5 అడుగుల వెడల్పుతో బోదెలు నాటిన రైతులకు రూ.10వేల నగదు బహుమతిగా ప్రకటిస్తున్నామన్నారు. ఏ రకం చెరకును నాటాలో ఆయన సూచించారు. నాటిన వారికి సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మూడు బస్తాలను ఇస్తానన్నారు. సాధారణ పద్ధతిలో నాటితే ఎకరాకు రూ. 5 వేలు నగదు, మూడు బస్తాల ఎరువు ఇస్తామన్నారు. నాణ్యమైన చెరకును సరఫరా చేసి రికవరీ పెంచితే మద్దతు ధర చెల్లిస్తామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు రైతు ప్రతినిధులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంగాధరనెల్లూరు 25 (ఆంధ్రజ్యోతి) : నూతనంగానపల్లి వద్ద బస్సు ఢీకొన్న సంఘటలో గాయపడిన దేశయ్య(కోటాగరం దళితవాడ) చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తొలుత చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీడీపీ నేతకు సత్కారం


దొరబాబు చౌదరిని సన్మానిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

పూతలపట్టు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన దొరబాబు చౌదరిని స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ సెల్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ఎస్సీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డిపల్లె హరి, ప్రతాపనేని చంద్రమౌళి,గణపతినాయుడు, గీత,ఇంద్రసేన తదితరులుపాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం

గుడిపాల నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సిబ్బంది తీరుపై తహసీల్దార్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కత్రాలమిట్ట పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కోసం ఇటీవల సర్వే నిర్వహించి భూమి పూజ కూడా చేశారు. స్థలం కొలతల్లో తేడా ఉందని ఫిర్యాదు రావడంతో మంగళవారం ఆయన వెళ్లి పరిశీలించారు. చిన్న స్థలాన్ని కూడా సక్రమంగా సర్వే చేయించకుంటే ఎలా అని రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు కరపత్రాల పంపిణీ

నగరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతన్న సేవలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని నగరి మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్ పేర్కొన్నారు. సత్రవాడలో మంగళవారం రైతన్న మీ కోసం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్తయ్య, పంచాక్షరం, చిందంబరం, తదితరులు పాల్గొన్నారు.

లాలూగార్డెన్‌లో అల్లుకున్న సమస్యలు


ధ్వంసమైన సిమెంటు రోడ్డు


పూడిపోయిన మురుగుకాల్వ

చిత్తూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున ఉన్న లాలూగార్డెన్ సమస్యలకు నిలయంగా మారింది. 30 ఏళ్లకు ముందు నిర్మించిన సిమెంటు రోడ్లు అధ్వాన స్థితికి చేరాయి. చాన్నాళ్లనాటి మురుగు కాల్వల్లో వ్యర్థపు నీరు ముందుకు పోయేదారి లేదు. 28వ డివిజన్‌లో లాలూగార్డెన్ ఉంది. కాలనీలో 850 కుటుంబాలు నివాసాలుండగా... అందులో 550 కుటుంబాలు మైనార్టీలే. 90 శాతం మంది కూలీ పనులపై ఆధారపడి బతుకుతున్నవారే. మూడు దశాబ్దాల క్రితం నిర్మితమైన కాలనీలో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఇక్కడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంటు రోడ్లు పగిలిపోయారు. ఇరుకు రోడ్డులో ప్రయాణించడం కష్టసాధ్యంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. సిమెంటు రోడ్డంతా దిమ్మెలు దిమ్మెలుగా విరిగిపోయింది. మురుగుకాల్వలు పూడిపోవడంతో వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. వర్షాకాలం వస్తే దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మిట్ట ప్రాంతంలో ఉండటం చేత పైపులైన్లన్నీ విరిగిపోతున్నాయి. సకాలంలో నగరపాలక ఇంజనీరింగ్ విభాగం అధికారులు చేయలేకపోవడంతో తరచూ నీటి సమస్య తలెత్తుతోంది. గత ప్రభుత్వ హయంలో సంపు కోసం రూ. 6 లక్షల మంజూరైనా ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదు. మామూలుగా అయితే వేసిన రోడ్లపైనే మళ్లీ మళ్లీ రోడ్లు వేసి బిల్లులు చేసుకున్న నేతలను చూశాం. నగరం నడి బొడ్డున.. ఆటోలు, రిక్షాలు తోలేవారితో పాటు పండ్ల వ్యాపారం చేసుకుని మైనార్టీలు అధికంగా ఉండే లాలూ గార్డెన్‌పై ఎందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు వివక్ష చూపుతున్నారో పాలకులకే తెలియాలని లాలూగార్డెన్ వాసులు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి లాలూగార్డెన్‌లో సిమెంటు రోడ్డు, మురుగుకాల్వలు, నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత



పాలూరులో రైతుకు కరపత్రాలను అందిస్తున్న జగన్మోహన్- గుట్టకిందపల్లి దళితవాడలో కరపత్రాలుచూపుతున్న నాయకులు,రైతులు

చిత్తూరు రూరల్/గుడిపాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం పాలూరు, బొమ్మసముద్రంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతును రాజు చేయాలన్నదే చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. అందుకోసమే సబ్సిడీ రుణాలు, పనిముట్లు, గోకులం షెడ్లు ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. అనంతరం పొలాల్లో పనిచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత, మోహన్‌రాజ్, రఘు, ఉపాధ్యక్షుడు మనోహర్ నాయుడు, బొమ్మసముద్రంలో జరిగిన కార్యక్రమంలో రాజేష్‌కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు : వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ కృష్ణమనాయుడు తెలిపారు. మంగళవారం ముక్కళత్తూరు పంచాయతీ మిట్ట దళితవాడలో ఇంటింటికి వెళ్లి రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీదర్‌యాదవ్, స్వామిదాస్, ఇమ్మానువేల్, జీవరత్నం, జాన్ తదితరలు పాల్గొన్నారు.

పెనుమూరు: గుట్టకిందపల్లి దళితవాడలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు పాల్గొన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సుహర్‌లత, వీఏఏ అములు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న రుద్రకోటి సదాశివం

చిత్తూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని నాయీ బ్రాహ్మణ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెపారు. మురకంబట్టులోని జీవీజీ కల్యాణ మండపంలో మంగళవారం జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణేతరులు క్షురకవృత్తిలోకి ప్రవేశించడంతో నాయీ బ్రాహ్మణుల వృత్తే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఆదరణ పథకం ద్వారా పనిముట్ల మంజూరు, అర్హులకు ఆలయాల్లో ఉద్యోగావకాశాలు లాంటి సమస్యలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు శ్రీకాంత్, సహదేవన్, సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షులు మురళీ, కార్యదర్శి ధనశేఖర్, కోశాధికారి వాసు కిరణ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పనుల కేటాయింపు

● మండల సమావేశంలో ఎంపీడీవోపై ధ్వజం


ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో పురుషోత్తం పనితీరుపై తిప్పినాయుడుపల్లె సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్‌లు ధ్వజమెత్తారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్, రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తిప్పినాయుడుపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.20 లక్షలు వస్తే పనులను నిబంధనలకు విరుద్ధంగా ఎంపీడీవో అప్పగించారని విమర్శించారు. గ్రామసభ నిర్వహించకుండా పనులు సమంజసం కాదన్నారు. ఎంపీడీవో పురుషోత్తం స్పందిస్తూ నిధులను అభివృద్ధి పనులకే సక్రమంగా కేటాయించామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ బోడిరెడ్డి సుధాకరరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్‌జీవో కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

బంగారుపాళ్యం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో తాలూకా యూనిట్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు రాఘవులు మంగళవారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో జరిగిన ఈ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా ప్రసాద్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా బాలసుబ్రమణ్యం,పరిశీలకులుగా రమేష్‌లు వ్యవహరించారు. తాలూకా అధ్యక్షురాలిగా భువనేశ్వరి, సహాధ్యక్షుడిగా డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్, కార్యదర్శిగా విక్రమ్, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యంరెడ్డి,వాణి,నాగేంద్రనాయక్,వెంకటేష్,ప్రవీణ్, జాయింట్ సెక్రటరీలుగా మునీంద్రరాజు,రోజారమణి, వినయ్ కుమార్,గోవిందరాజులు,కోశాధికారిగా కవిత ప్రియదర్శినిలు ఎన్నికయ్యారు.

మాజీ మంత్రి రోజా పరామర్శ

విజయపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎంఅగరం సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బాలకృష్ణమనాయుడిని మాజీ మంత్రి రోజా మంగళవారం పరామర్శించారు. కర్మాగారంలో ప్రమాదవశాత్తు గాయపడి కోలుకుంటున్న ఆయనకు పార్టీ ద్వారా వైద్య సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జగన్నాథపురంలో ఇటీవల మృతి చెందిన నాగేంద్ర కుటుంబాన్ని కూడా రోజా పరామర్శించారు. పార్టీ నాయకులు గోవర్ధన్‌నాయుడు, శివరాజు, గుణశేఖర్‌రెడ్డి, బాబు, రమేష్, పాండ్యన్ పాల్గొన్నారు.

నిండ్ర: ఇటీవల మృతి చెందిన వైసీపీ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి రోజాపరామర్శించారు. వడివేలు తండ్రి ఇటీవల మృతి చెందాడు. నిండ్ర దళితవాడకు చెందిన పాస్టర్ ఇమాన్యుయల్ భార్య ఇటీవల మృతి చెందింది. వీరి కుటుంబాలను ఆవె ుపరామర్శించారు. ఎంపీపీ దుర్గాదేవి, మండల కన్వీనర్ వేణురాజు శ్యాంలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళమిస్తున్న దాతలు

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పుత్తూరుకు చెందిన కె.భవాణి, కె.గోపిలు రూ.లక్ష విరాళం ప్రకటించారు. విరాళ మొత్తాన్ని వారు మంగళవారం ఆలయ నిర్మాణ కమిటీ నాయకులకు అందజేశారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారినిప్రత్యేకంగా అలంకరించి పాలు, పెరుగు, తేనె, పసుపు, కుంకుమలతో అభిషేకించారు. రాహుకాల, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

3,4 తేదీల్లో కార్తీక దీప మహోత్సవాలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్‌రాయకొండలోని సుబ్రమణ్యేశ్వర ఆలయంలో డిసెంబరు 3,4 తేదీల్లో కార్తీక దీప జ్వాలా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తమిళ కార్తిక మాస కృత్తిక, పౌర్ణమిల సందర్భంగా దీనిని నిర్వహిస్తున్నామన్నారు.

పరమత సహనం అలవర్చుకోవాలి

చిత్తూరు కల్చరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఇస్లాం అభిమతమైన పరమత సహనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని నగర జమాతే ఇస్లాం హింద్ ప్రతినిధులు కోరారు. వారు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఖాజీలను కలిసి ఆదర్శ పొరుగువారు - ఆదర్శ సమాజం కరపత్రాలను ఆవిష్కరిచారు. సంస్థ రాష్ట్ర సలహా మండలి డా. అబ్దుల్ అలీం ఉమ్రీ, జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ ఖాన్, అల్తాఫ్ షరీఫ్, ఎసం, ఎం ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.